


శుక్రవారం!

కామేశ్వరమ్మ తల స్నానం చేసి పట్టుచీర కట్టుకుని బీరువాలో ఉన్న నగలన్నీ పెట్టుకుని మహాలక్ష్మికి పూజ చేస్తున్నది. కామేశ్వరమ్మకి దైవభక్తి ఎక్కువ. అందులోనూ లక్ష్మీదేవి అంటే మహాభక్తి. అసలు ఈ లక్ష్మీదేవిని పూజించటం మొదలెట్టిన తరవాత తన ఇల్లంతా బంగారం అయిందని ఆవిడ విశ్వాసం. భర్తని ఆఫీసుకీ, పిల్లలిద్దరినీ స్కూలుకీ పంపేసి ప్రహారీగేటు మూసి గ్రిల్లు వరండాకి తాటికాయంత తాళం బిగించి, ఎంత నిశ్చింతగా రోజూ అమ్మవారి పూజకి కూర్చుంటుంది. తాపీగా అలాగే పూజ పూర్తి చేసి, కొబ్బరికాయ కొట్టి హారతి ఇచ్చి భక్తితో కళ్ళు మూసుకుంది.

''అమ్మా! నే నేది కోరుకున్నా ఇట్టే తీరుస్తున్నావు ఇన్నాళ్ళూ. కానీ నా ఇంట్లో ఒక్క వాటా ఖాళీ అయి మూడు నెలలు అయిపోయింది. అందరూ వచ్చి చూసి పోయేవాళ్ళే కానీ అద్దెకు ఇస్తాం అన్న వాళ్ళు కనిపించలేదు. ఇంత నష్టపడుతూంటే నీవు చూస్తూ ఎలా ఉన్నావమ్మా? నేను నీ భక్తురాలినే. క్రమం తప్పకుండా శ్రద్ధగా పూజిస్తున్నానే'' అని ఆర్తిగా విన్నవించుకుంది. కళ్ళు తెరిచింది.

అమ్మ కరుణించిందా అన్నట్టు తను పూజ చేసిన పువ్వు ఆమె తల నించి మెల్లగా కిందకి జారటం కనిపించింది కామేశ్వరమ్మకి. సంతోషం వేసింది. చటుక్కున లేచి మరోసారి దణ్ణం పెట్టి ఇవతలికి వచ్చింది. వరండాకి వేసిన తాళం ఒకసారి చూసుకుంది. భర్త మహా 'పిరికిపందా'. ప్రతి గదికీ తాళం బిగించాలే. కొంత ఖర్చైనా లేదు. నువ్వు ఎప్పుడో దొంగలు, భయాలంటూ ముడుచుకు కూర్చుంటావు' అంటాడు.

''ఆ. మనింటికేం భయం. ఇనప్పెట్టె లాంటి